క్లుప్తంగా

నష్టపరిహారం చెల్లించాలని దీక్ష

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలోని పిరాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు వాగే చలపతి సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోయిన భూమికి నష్ట పరిహారం చెల్లించాలని బుధవారం కుటుంబంతో కలిసి తన స్థలంలో దీక్ష చేపట్టాడు. సీతమ్మ సాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో తన 5 ఎకరాల భూమి కోల్పోతుండగా పరిహారం వేరే వ్యక్తి ఖాతాలో జమ చేయడంతో ఇంతకాలం అధికారుల చుట్టూ తిరిగాడు. ఇక లాభం లేదనుకుని కుటుంబంతో కలిసి దీక్ష చేపట్టాడు. తనకు రావాల్సిన నష్ట పరిహారం వేరే వ్యక్తి తన అకౌంట్‌లో పడేలా రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకున్నాడని తనకు నష్ట పరిహారం చెల్లించే వరకు తన భూమిలో ఎటువంటి పనులు చేపట్టవద్దని కోరుతూ ఆ స్థలంలో బరకాలతో గుడారం ఏర్పాటు చేసుకుని దీక్ష చేపట్టాడు.

ఎండలతో జాగ్రత్తలు తప్పనిసరి

అన్నపురెడ్డిపల్లి: ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఎండకు తలపాగ ధరించడం, గొడుగులు వాడడం, ఓఆర్ఎస్, పండ్ల రసాలు,నీళ్లు ఎక్కువగా తాగాలని సూచించారు. అనంతరం పెంట్లం గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తన్మయి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. స్థానిక అమ్మ సేవా సదనంలోని వృద్ధులకు అజయ్‌కుమార్ అభిమానుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా, స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా వారందరికీ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నారం రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, కాసాని చంద్రశేఖర్, బిర్రం వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ జేకేవీ రమణారావు, తాడేపల్లి రవి, సత్యవరపు సంపూర్ణ, మోహన్ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమాన్ని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు దంపతులు నిర్వహించారు. బుధవారం ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమం వద్దకు రాలేని, పేదరికంలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు అన్నప్రసాదాలను పార్శిల్ చేసి, ఆశ్రమ వాలంటీర్లు స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు.

నేటి నుంచి టోర్నమెంట్

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ తెల్లం వెంకట్రావుల ఆర్థికసాయంతో నిర్వహించే ఈ పోటీలో.. మొదటి బహుమతి రూ.25,116, ట్రోఫీ, రెండో బహుమతిగా రూ.15,116, ట్రోఫీలను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌కు కూడా బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు మేనేజ్‌మెంట్ తోట రమేష్ 9949263057, సొందే రమేష్ 9959318961 పిసోడి రాజు 6309622571 ను సంప్రదించాలని కోరారు.

30 నుంచి జాతర

దమ్మపేట: మండలంలోని లచ్చాపురంలో ఈ నెల 30 నుంచి మే 2వ తేదీ వరకు కొర్రాజుల స్వామి జాతర జరగనుంది. ఈ మేరకు మండలంలోని తాటిసుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును బుధవారం కలిసిన ప్రజాప్రతినిధులు.. జాతరకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. వారిలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపాటి ప్రసాద్‌తో పాటు రావూరి వీరయ్య, లచ్చిరాం, నల్లపు నాగేంద్ర, దివాకరరెడ్డి ఉన్నారు.

అధికారుల సంతాపం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చినరాయిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ కుంజా నరసింహారావు తల్లి కుంజా బోడమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా.. మణుగూరు తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐలు శ్రీనివాస్, లీలావతిలు బోడమ్మ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. సీనియర్ అసిస్టెంట్ నరసింహారావును, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో సర్వేయర్ తిరుపతయ్య, రెవెన్యూ సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రమాదాలతోనైనా తీరు మారదా?

- అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తున్న వాహనదారులు
- అదుపు లేకుండా వేగం
- నమోదవుతున్న వరుస ఘటనలు
- అయినా అదే నిర్లక్ష్యం..



బండిరేవు గ్రామంలో జరిగిన ప్రమాదంలో చెల్లాచెదురుగా పడ్డ కూలీలు (ఫైల్)



టాటా మ్యాజిక్ టాప్‌పై ఎక్కించుకుని వెళ్తున్న వాహనదారుడు



పరిమితికి మించి జనాలతో వెళ్తున్న ఆటో

దుమ్ముగూడెం: మండలంలో పలు వాహనాలు అధిక లోడ్‌లతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి. అయినప్పటికీ సదరు వాహన యజమానులు, డ్రైవర్ల తీరులో మార్పు రావడం లేదు. వ్యవసాయ సీజన్ కావడంతో ఆటోలు, బొలెరోలలో పరిమితికి మించి మనుషులను ఎక్కిస్తూ ప్రయాణాలు కారణమవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి.

బాధితుల్లో మెజారిటీ కూలీలే..

ప్రస్తుతం మండలంలోని ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యం ఉండటంతో వాహనాలు అధిక స్పీడ్‌తో నడుపుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల అవసరం కావడంతో పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి కూలీలు పనికి వస్తుంటారు. మండలంలోని ఆటోవాలాలు, బొలెరో వాహనదారులు గ్రామాల్లోకి వెళ్లి కూలీలను మాట్లాడుకుని అప్ అండ్ డౌన్ అదే వాహనంలో వచ్చేలా రేటు మాట్లాడుకుంటారు. సదరు వాహన డ్రైవర్,యజమాని మండలంలో కూలీలు అవసరమైన రైతులకు వారిని వాహనంలో పరిమితికి మించి ఎక్కించుకుని తీసుకునివస్తుంటారు. ఈ క్రమంలో మండలంలోని చినబండిరేవు గ్రామంలో జరిగిన వాహన ప్రమాదంలో 25 మంది గొత్తికోయ కూలీలు గాయపడి ఒక యువతి మృతి చెందిన సంగతి విదితమే. కాగా ఆ వాహన డ్రైవర్ సుమారు 65 మంది కూలీలను ఎక్కించుకుని దాదాపు 60 కిలో మీటర్లు (కిష్టారం టూ చర్ల) నిత్యం ప్రయాణిస్తుండటం విశేషం. ఆ ప్రమాదం ప్రధాన రహదారి మీద జరిగింది కాబట్టి తక్షణమే గ్రామస్తులు చర్యలు చేపట్టారు. అదే అటవీ ప్రాంతంలో జరిగి ఉంటే పరిస్థితి ఏంటి?.

తీరుమారని వాహనాలు

అధికలోడు, అధిక స్పీడు కారణంలో అనేక మంది కూలీలు మృత్యువాత పడుతున్నా.. గాయాలపాలవుతున్నా.. కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికీ కిక్కిరిసే విధంగా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. పరిమితికి మించి వేగంతో ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితిలు స్థానికులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కనిపించని తనిఖీలు..

ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెంలో ఆర్టీఏ అధికారులు పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇష్టం వచ్చిన రీతిలో అధిక లోడ్‌లతో ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాల్లో అధికంగా జనాభాను ఎక్కించుకుని ముందు వెళ్లే వాహనాలను అధిక స్పీడ్‌తో ఓవర్ టేక్ చేస్తున్న ఘటనలు కోకొల్లలు. మండల వ్యాప్తంగా ఉన్న ఆటోలకు, బొలెరోలకు, ట్రాక్టర్‌లకు సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్నా సంబంధిత శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడైనా అధికారులు తనిఖీలు చేపట్టి కఠినమైన చర్యలు తీసుకుంటే పెద్ద ప్రమాదాల నుంచి ప్రయాణికులను రక్షించినవారవుతారని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కొందరు పోలీస్ అధికారులు వాహన తనిఖీలు చేపడుతున్నప్పటీ వ్యవసాయ సీజన్ కావడంతో రైతుల పరిస్థితులను అర్థం చేసుకుని డ్రైవర్లకు అవగహనతో సరిపెడుతున్నారు. కానీ ఆ డ్రైవర్లలో మార్పు రాకపోవడం కొసమెరుపు.

అవగాహన కల్పిస్తున్నాం..



పరిమితికి మించి వాహనాల్లో జనాలను తరలిస్తే ప్రమాదాలు జరుగుతాయి. దానికి వాహన యజమాని బాధ్యుడు అవుతాడు. ఈ మేరకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వాహన తనిఖీల సమయంలో ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువ మంది ఒకే వాహనంలో ప్రయాణించ వద్దని సూచిస్తున్నాం. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇస్తే ప్రమాదం జరిగితే దానికి వాహన యజమానే బాధ్యుడు. – దోమల రమేష్, సీఐ

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా ప్రభావిత గ్రామాలైన కృష్ణసాగర్, ఎస్టీకాలనీ, ఎస్సీకాలనీ, దేవగుంపు, ఉర్లదోసపాడు, చెరువుసింగారం, ఏడుళ్లచెరువు, గోపాలపురం, గోదారమ్మ క్యాంపు, లక్ష్మయ్యగుంపు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

గ్రామస్తుల నుంచి రక్త నమూనాలు సేకరించి ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 1684 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. వారిలో ఎవరికీ ఎలాంటి మలేరియా కేసులూ నమోదు కాలేదు. వైద్యాధికారి డాక్టర్ స్పందన ఆధ్వర్యంలో చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో బీవీవీ రమణమూర్తి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కృష్ణసాగర్‌లో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సీపీఆర్‌పై ఉద్యోగులకు శిక్షణ



సీపీఆర్ శిక్షణలో పాల్గొన్న వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు

దుమ్ముగూడెం: కార్డియాక్ అరెస్టుకు గురైన వ్యక్తికి కొద్ది నిమిషాల్లో సీపీఆర్‌ను చేయగలిగితే ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం ఆయన పర్యవేక్షణలో ములకపాడు, పర్ణశాల, నర్సాపురం డాక్టర్లు పుల్లారెడ్డి, రేణుకారెడ్డి, నిశాంత్‌రావులు మండలంలోని పోలీస్, సీఆర్పీఎఫ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. ప్రజల విలువైన ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతోనే సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామని, దీనివల్ల ప్రతి 10 మందిలో ఐదుగురిని బతికించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐ దోమల రమేష్, ఎస్సైలు రవికుమార్, నర్సిరెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ ముత్యాలరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



అశ్వారావుపేటరూరల్: ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అశ్వారావుపేటలోని పెద్ద మసీదులో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరు కాగా.. ఉపవాస దీక్ష పాటిస్తున్న ముస్లిం సోదరులకు ఆయన భోజనాన్ని వడ్డించారు. ముందుగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అలాగే మండలంలోని వినాయకపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు, చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి ఆధ్వర్యంలో ముస్లింలకు వారి నివాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అదే విధంగా గుమ్మడవల్లి మసీదులో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ మారుతీ లలిత, పార్టీ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్.ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, వెంకన్న, సత్యవరపు సంపూర్ణ, కాసాని చంద్రమోహన్, ఉప్పల ప్రసాద్, లోకం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు వితరణ

అశ్వాపురం: రంజాన్ సందర్భంగా మండలంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందుకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొమ్మిది గ్రామాల ముస్లింలకు రూ.70వేలు అందజేశారు. మండల పరిధిలోని అమ్మగారిపల్లి, కల్యాణపురం, గౌతమీనగర్‌కాలనీ, అశ్వాపురం, చింతిర్యాలక్రాస్‌రోడ్డు, రామచంద్రాపురం, వెంకటాపురం, తురకలగూడెం, గొందిగూడెం గ్రామాలు ఇందులో ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ ముత్తినేని సుజాత ఆ నగదును ముస్లిం పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖదీర్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు ఓరుగంటి రమేష్, కందిమల్ల రామిరెడ్డి, పులసాని మల్లారెడ్డి, దేపంగి వెంకటరమణ, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్, ఎస్‌కె.జాని, ఎస్‌కె.బాజిబాబా, ఎస్‌కె.అన్సారీ, అంకుస్‌ఆలీ, నాయకులు పాల్గొన్నారు.

ఒక్క రోజులో నాలుగు కాన్పులు

గుండాల: గుండాల పీహెచ్‌సీలో బుధవారం ఒక్కరోజు నాలుగు ప్రసవాలు జరిగాయి. సాధారణంగా ఒకటి రెండు డెలివరీలు అవుతాయి. కాగా ఒకే రోజు నాలుగు ప్రసవాలు చేసి ఈ ఏడాది అరుదైన రికార్డు సృష్టించారు. గత ఏడాది, వేర్వేరు రోజుల్లో ఐదు, ఆరు ప్రసవాలు జరిగాయి. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రసవాలు చేసినట్లు వైద్యాధికారి మనేష్ రెడ్డి తెలిపారు. వారందరికీ కేసీఆర్ కిట్లు అందించారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

మణుగూరురూరల్: మండలంలోని విజయనగరం శ్రీసమ్మక్క-సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మణుగూరులో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి నుంచి పదో వార్డ్ వరకు కార్యకర్తల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, యూసఫ్ షరీఫ్, కీసర శ్రీనివాస్‌రెడ్డి, రుద్ర వెంకట్, గుర్రం సృజన్, ఉల్లోజు బాబీ, నాగరాజు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

దుమ్ముగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల దగ్గర కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ చంద్రమౌళి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పని దగ్గర కూలీలకు నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సదుపాయాలను కల్పించాలన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శిరీష

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామానికి చెందిన ముష్టిన శిరీష అశ్వారావుపేట మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న ఆమెను నియామకం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు, శ్రీను పాల్గొన్నారు.

తొమ్మిదోసారి రక్తదానం

భద్రాచలంటౌన్: అశ్వాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు కమలమ్మ శస్త్రచికిత్స కోసం రక్తం అత్యవసరం కావడంతో ఫైర్ కానిస్టేబుల్ బండారు సతీష్ అరుదైన ఓ నెగిటీవ్ రక్తాన్ని 9వ సారి దానం చేశారు. ప్రమాదవశాత్తు కమలమ్మకు కాలు విరగగా.. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సలో భాగంగా రక్తం అవసరం పడినట్లు వైద్యుల తెలిపారు. దీంతో వృద్ధురాలి కుటుంబ సభ్యులు మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళిని సంప్రదించారు. స్పందించిన ఆయన స్థానిక ఫైర్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేయించి కమలమ్మకు రక్తం అందించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బూర్గంపాడు: సారపాకలోని ఒక హృదయం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో భద్రాచలం అగ్నిమాపక కేంద్రం నేతృత్వంలో అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. భద్రాచలం అగ్నిమాపక కేంద్ర ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంటగ్యాస్, ఎలక్ట్రికల్ ఫైర్‌పై మాక్ డ్రిల్ చేయించారు. గ్యాస్ సిలిండర్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్, ఒక హృదయం సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు మిట్టకం టి.సంజీవరెడ్డి, వలదాసు సాలయ్య, పొన్నాల కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

‘సీతమ్మ సాగర్’ పనులు నిలిపివేయాలి

అశ్వాపురం: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఉత్తర్వుల మేరకు సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ పనులు తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మణిధర్, ఇరిగేషన్ కార్యాలయం అధికారులకు ఎన్‌టీజీ ఉత్తర్వుల కాపీ పత్రాలను అందజేశారు. పర్యావరణ అనుమతులు లేని కారణంగా పనులు నిలిపివేయాలని ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా గాదె కేశవరెడ్డి మాట్లాడుతూ.. అన్ని అనుమతులు పొందాక మాత్రమే పనులు చేపట్టాలని చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు బట్టా విజయగాంధీ, నాయకులు బచ్చు వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



రాక్షస గుళ్ల గురించి వివరిస్తున్న అధ్యాపకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ జీవశాస్త్రం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని రాయన్నపేట గ్రామానికి బుధవారం క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 3 వేల సంవత్సరాల క్రితం నిర్మించిన రాక్షసగుళ్ల (సమాధులు) ప్రాచుర్యాన్ని అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న వివిధ రకాల వృక్ష జాతుల వైవిధ్యాన్ని విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జంతుశాస్త్రం అధ్యాపకులు శ్రీను, దుర్గా భవాని, నాగ సమీరా, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సింగరేణిలో దీక్ష

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీకే ఓసీ–2లో ప్రవేశపెట్టిన సర్ఫేస్ మైనర్, డ్రిల్‌ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఒక్కరోజు నిరాహారదీక్షను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి ఏరియా కార్మికులు సింగరేణిని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే.. ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. ఇప్పటికే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీతో నిరసనలు, ఆందోళనలు చేశామని, ఇక దీక్ష చేయనున్నామని తెలిపారు. సేవ్ సింగరేణి నినాదంతో కలిసి వచ్చే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటాలు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు కందిమల్ల రామయ్య, గోపిశెట్టి శివయ్య, సుభాని, ఆవుల నాగరాజు, ఎ.సురేందర్, గోలి గంగాధర్, మల్లేష్, సుధాకర్, శ్రీనివాస్, పుల్లారావు, శంకర్‌రావు, రవి, రాజేష్, ఆలీలు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరుకున్న సమ్మె



బూర్గంపాడు: మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

మణుగూరుటౌన్: ఐకేపీలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని రెండు రోజులుగా చేస్తున్న సమ్మె బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనుగోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 17వేల 606మంది వీఓఏలు దీర్ఘకాలికంగా చాలిచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారు. వారు చేపట్టిన సమ్మెకు సీఐటీయూ, సీపీఎం నేతలు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వెంకటలక్ష్మి, చాందినీ, ధనలక్ష్మి, లలిత, మనేమ్మ, రామారావు, అరుణల తోపాటు ఇతర వీఓఏలు దీక్షల్లో పాల్గొన్నారు. మద్దతు తెలిపిన వారిలో సీపీఎం, సీఐటీయూ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, నర్సింహారావు, సులోచన, రాము, రమేష్, స్రవంతిలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: వీఓఏల యూనియన్ సీఐటీయూ సమ్మె బుధవారం 3వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మర్మం చంద్రయ్య సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వీఏఓలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కనీస వేతన రూ.26వేలు అందచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఏఓల సంఘం మండల కార్యదర్శి నాగరాజు, గుట్టయ్యా, కుమారి, లత, కృష్ణవేణి, దుర్గా, వెంకటేష్, లక్ష్మి, కిషన్, రాజేష్, రాజేశ్వరి, రమాదేవి, మని రాజు, నరేంద్ర, అరుణ, వెంకటలక్ష్మి, పాపమ్మ, కమల, మంగవేణి పాల్గొన్నారు.

బూర్గంపాడు: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయు ఆధ్వర్యంలో మూడురోజులుగా నిరసన నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రం బూర్గంపాడులో వీఓఏలు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య మాట్లాడారు. నిరసన దీక్షల్లో వీఓఏల సంఘ నాయకులు, వీఓఏలు పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలో వీఓఏల సమస్యల పరిష్కారంకై చేపట్టిన సమ్మెకు బుధవారం న్యూడెమోక్రసీ పార్టీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు, ఎంపీపీ ముక్తి సత్యం మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్శిక రవి, ఈసం కృష్ణ, కల్తి మల్లయ్యా, మల్యాల మల్లేష్, ఈసం బొమ్మయ్య, జిమ్మిడి సాంబయ్య, అరెం కాంతారావులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఐకేపీ వీఓఏలు భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చేస్తున్న నిరసన దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ, టీటీడీపీ పట్టణ కమిటీ సంఘీభావం తెలిపింది. సీఐటీయూ జిల్లా నాయకులు యంబి.నర్సారెడ్డి, రేణుక, సంతోష్, లక్ష్మీకాంత్, శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె.అజీమ్, చిట్టిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిర్మించారు.. వదిలేశారు..



మండలంలోని సత్యనారాయణపురంలో సుమారు ఏడేళ్ల క్రితం గ్రంథాలయం కోసం మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. లక్షలు వెచ్చించి లక్షణంగా ఈ భవనాన్ని వదిలేయడంపై జనం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన గ్రామం మధ్యలో నిర్మించిన ఈ భవనాన్ని ప్రారంభించి, కార్యకలాపాలు నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ గ్రంథాలయ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - చర్ల

ప్రశ్నించాల్సిన అధికారి: బి.రామకృష్ణ, ఎంపీడీఓ, చర్ల
ఫోన్ నంబర్: 99632 73631